

## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్చేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.

# వృద్ధికి టారిఫ్ దెబ్బ

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

### ట్రంప్ సుంకాల సెగ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

### రూపాయి అధోగతే..

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటి దాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.
- చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.
- అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.
- అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.
- పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శణమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**



న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.

## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

**సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం**



ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్స్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.

## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్ఏపీసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతో పాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## 20న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



శ్రీరాంపూర్ : మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

శ్రీరాంపూర్, మే 2 : బొగ్గు గనుల ప్రైవేటీకరణ, అమ్మకానికి వ్యతిరేకంగా, కార్మికుల సమస్యల పరిష్కారానికి 20న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. శ్రీరాంపూర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మకానికి పెట్టిందని, బొగ్గు పరిశ్రమను సజీవంగా సమాధి చేసేందుకు కుట్రలుచేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ, ప్రధాన కార్యదర్శి జే సీతారామయ్య, నాయకులు పోతుల కృష్ణయ్య, నరేశ్, రామకృష్ణ, మేకల రామన్న, కాపు కృష్ణ, దేవయ్య, నరసింగం, మల్లేశ్, టీ శ్రీనివాస్, మొండయ్య, అశోక్, రాయమల్లు, చంద్రన్న, బాబు, శేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, మే 2 : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కోరారు. కోటపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిని బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. నాయకులు కుమార్, మేడి మహేశ్, శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

చెన్నూర్ టౌన్, మే 2 : చెన్నూర్‌లో శుక్రవారం శంకరజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో మహావాది వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 73వ గణపతి అథర్వ శీర్ష సహస్రాభిషేకం చేశారు. హైదరాబాద్ నుంచి తరలివచ్చిన బ్రాహ్మణులు సహస్రావర్తనంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కొమ్మెర విశ్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో పురవీధుల గుండా శంకరాచార్యుల చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. శంకరజయంతి ప్రాశస్త్యాన్ని కొమ్మెర విశ్వేశ్వర శర్మ వివరించారు. మహావాది వినోద్ కుమార్, కొమ్మెర విశ్వేశ్వర శర్మ, రాజేశ్వర్ రావు, కృష్ణమూర్తి, నవీన్, సాంబసదాశివ శర్మ, దహగాం శంకర్, కసోజ్జల కమలాకర్, వెంకటేశ్వర్, మూర్తి, రేగళ్ల సంతోష్ కుమార్, కాకరాల సురేశ్, వేమారపు మహేశ్వర శర్మ, దుద్దిళ్ల శ్రీనివాస్, కేవీఎం ప్రకాశ్ రావు, మహావాది సురేశ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అటవీ శాఖ అధికారుల ఆంక్షలు

- **మండిపడుతున్న సుస్మీర్ గ్రామస్తులు**
- **సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి**

బెజ్జూర్, మే 2 : బెజ్జూర్ మండలం సుస్మీర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు లేవని అటవీ అధికారులు ఆంక్షలు పెట్టగా, గ్రామస్తులు మండిపడ్డారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ గ్రామంలో అధికారులు 22 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, ఇంటి నిర్మాణాలు చేసేందుకు అంతా సిద్ధం చేసుకున్నామన్నారు. కానీ, బేస్మెంట్ నిర్మాణాలను నిలిపివేయాలని అటవీ అధికారులు అంటున్నారని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తే అటవీ అధికారుల దౌర్జన్యం ఏమిటో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సుస్మీర్ గ్రామ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



తాండూర్ హైస్కూల్‌లో శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి మల్లేశం



కౌటాల జడ్పీ పాఠశాలలో సమ్మర్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు




దండేపల్లి : మాట్లాడుతున్న ఎంఈవో చిన్నయ్య

తాండూర్, మే 2 : వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎస్ మల్లేశం సూచించారు. మండలంలోని తాండూర్, తంగళపల్లి, రేచిని హైస్కూళ్లలో శిక్షణ శిబిరాలను శుక్రవారం హెచ్ఎంలతో కలిసి ప్రారంభించారు. 15వ తుదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హాజీపూర్, మే 2 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధి ముల్కల్ల ప్రభుత్వ, మండలంలోని దొనబండ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సమ్మర్ క్యాంప్‌లను హెచ్ఎంలు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు బొమ్మ గణపతి రెడ్డి, హన్మండ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం, మే 2 : మండలంలోని కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్ఎం కట్ట రాజమౌళి ప్రారంభించారు. 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌటాల, మే 2 : కౌటాల మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో గావుడే హన్మంతు పరిశీలించారు. విద్యార్థులు నేర్చుకుంటున్న పలు కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 2 : విలేజ్ నస్పూర్‌లోని జడ్పీ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్ఎం దామోదర్ రావు ప్రారంభించారు. నస్పూర్ పాఠశాలతో పాటు తీగల్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి, మే 2 : దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో చిన్నయ్య ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో టాపర్లుగా నిలిచిన పదో తరగతి విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నరేందుల శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వేమనపల్లి, మే 2 : వేమనపల్లి, నీల్వాయి గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ఎంఈవో శ్రీధర్‌రెడ్డి పారరంభించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉంటుందని, 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

కాసిపేట, ఏప్రిల్ 2 : కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో వేసవి శిబిరాన్ని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ప్రారంభించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. 100 మంది విద్యార్థులకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిర్యాణి, మే 2 : తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ క్రీడలతోపాటు వ్యాయామ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జిల్లా యువజన క్రీడల అధికారి, మండల ప్రత్యేకాధికారి రమాదేవి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రారంభించారు. మే 1 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్నటుల తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల గిరిజన క్రీడల అధికారులు మీనారెడ్డి, జీవరత్నం, క్రీడల ఇన్‌చార్జి గుండం లక్ష్మణ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదారత చాటుకున్న ఆటో డ్రైవర్

**రూ. 3 విలువ గల బంగారు నగల బ్యాంగు అప్పగింత**




ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్

మంచిర్యాల అర్బన్/తాండూర్, మే 2 : ఓ ప్రయాణికురాలు ఆటోలో మర్చిపోయిన రూ. 3 విలువ గల బంగారు నగలు ఉన్న బ్యాంగును అప్పగించి డ్రైవర్ ఉధారత చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. తిర్యాణి గ్రామానికి చెందిన రాజేశ్వరి శుక్రవారం ఉదయం ఐబీ నుంచి మంచిర్యాల వెళ్లే క్రమంలో మంచిర్యాల హైటెక్ సిటీ వద్ద ఆటో దిగి, అందులోనే తన బ్యాగు మర్చిపోయింది. బ్యాగులో రూ.3 లక్షల విలువ గల బంగారం ఉండడంతో కంగారుపడుతూ ఆ సమాచారాన్ని తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్‌భాషాకు తెలియజేసింది విషయం తెలుసుకున్న వెంటనే డ్రైవర్ పోలికలు, ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ సంభాషణ ఆధారంగా అతను తాండూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ జాడి రామకృష్ణ అని గుర్తించారు. మంచిర్యాల బజాజ్ షోరూంకు ఆటో సర్వీసింగ్ వెళ్లినట్టుగా గుర్తించిన, హబీబ్ భాషా సంబంధజత షోరూం సిబ్బందితో మాట్లాడాడు. వారి సహకారంతో ఆటోలో మర్చిపోయిన బ్యాగును ప్రయాణికురాలికి అప్పగించారు. డ్రైవర్‌ను యూనియన్ అధ్యక్షుడితో పాటు పలువురు అభినందించారు.

## కార్డెన్ సెర్చ్‌తో నేరాల నియంత్రణ

రెబ్బెన, మే 2 : కార్డన్ సెర్చ్, కమ్యూనిటీ కాంట్రాక్టుతో నేరాలు నియంత్రించవచ్చునని రెబ్బెన సీఐ బుద్ధే స్వామి అన్నారు. గోలేటి గ్రామంలో శుక్రవారం ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్, కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుడుంబా తయారీ, కొనుగోలు చేస్తూ పట్టుబడ్డ ఐదుగురిపై కేసులు నమోదు, 50 వాహనాలు పరిశీలించి, 3 వాహనాలకు పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెబ్బెన సీఐ బుద్దే స్వామి, పక్కన ఎస్ఐ చంద్రశేఖర్

## దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : రైసింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన సంస్థ అభివృద్ధి కేంద్రంలో ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అశోక్ శుక్రవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

## సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

నస్పూర్, మే 2 : భూ భారతి చట్టంలో భాగంగా ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాకో మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో వీడియాకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. మొదటి విడుతగా రాష్ట్రంలోని 4 జిల్లాల్లోని 4 మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల సమస్యలపై అర్జీలు స్వీకరించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెపారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. పైలెట్ మండలంగా భీమారం ఎంపిక చేశామన్నారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసరావు, గృహ నిర్మాణ ప్రాజెక్టు అధికారి బన్సీలాల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏసీపీ ప్రకాశ్, తహసీల్దార్లు, భూ సర్వే ఏడీ పాల్గొన్నారు.

## వేగవంతం చేయాలి

తాండూర్, మే 2 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని పైలట్ గ్రామం గోపాల్‌నగర్‌కు చెందిన లబ్ధిదారులతో శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ప్రత్యేక సమవేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు తమ ఆర్థికపరమైన ఇబ్బందులు గురించి అధికారులకు విన్నవించారు. ప్రభుత్వ, శాఖాపరమైన క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు తెలిపారు.

## వేతనాల కోసం ఆందోళన

కాగజ్‌నగర్, మే 2 : కాగజ్‌నగర్ పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో గల మణికంఠ ప్రైవేట్ దవాఖాన సిబ్బంది వేతనాల కోసం శుక్రవారం ఆందోళన చేపట్టారు. కొన్నేళ్లుగా దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్నా సదరు వైద్యుడు శివదర్శనం నెల నెల సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని, ఎప్పుడు అడిగినా రేపుమాపు అంటు కాలం వెళ్లదీస్తున్నాడని సిబ్బంది లావణ్య, శ్రవంతి, శ్రీలక్ష్మి, జ్యోతి వాపోయారు. వేతనాలు చెల్లించే దాకా దవాఖాన ముందు నుంచి వెళ్లేది లేదని భీష్మించారు. కాగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు చెల్లిస్తానని, 15 రోజుల గడువులోగా మిగత వేతనాలు చెల్లిస్తానని వైద్యుడు చెప్పడు. తమకు రావల్సిన వేతనాలు చెల్లించాలని సాయంత్రం వరకు దవాఖాన ముందు నిరసన తెలిపారు.

## ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

వేమనపల్లి, మే 2 : జన కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలాధ్యక్షుడు ఏట మధూకర్, మండల ప్రధాన కార్యదర్శి ఏనుముల వెంకటేశ్, నాయకులు మధునయ్య, అజయ్‌కుమార్, చరణ్‌రాజ్, సత్యనారాయణ, చారి, మల్లేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి, మే 2 : మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో బీజేపీ, పలు సంఘాల నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణాధ్యక్షుడు మార్త కుమారస్వామి, బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, రొడ్డ మోహన్, రాంటెంకి దుర్గరాజ్, కోలేటి శివ, కొంతం రాజు, ఎర్రోజు శ్రీనివాస్, ఓం ప్రకాశ్, పారిపెల్లి శ్రీనివాస్, మొగిలి అంజయ్య, రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.